# ఓటరు ఐడీ కార్డు లేకుంటే..

**12 రకాల ఫొటో ఐడీ కార్డుల్లో ఏదో ఒకటి చూపించండి..**

**312 మంది అభ్యర్థులు.. 20 వేల మంది పోలింగ్ సిబ్బంది**

- 4119 పోలింగ్ కేంద్రాలు.. 1677 లోకేషన్లు
- 30న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- నేటి సాయంత్రం 5 గంటలకే ప్రచారం ముగింపు
- ఎన్నికల్లో ఇప్పటి వరకు రూ. 79.07 కోట్ల నగదు పట్టివేత
- పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం
- జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికలు కీలక దశకు చేరాయని, ఈ నెల 30వ తేదీన జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ప్రజలు గూగుల్ మ్యాప్ ద్వారా తెలుసుకోవాలన్నారు. పోల్ క్యూ రూట్ యాప్ ద్వారా తమ పోలింగ్ కేంద్రంలో ఎందరు క్యూలో ఉన్నారన్న విషయాన్ని తెలుసుకొని వెళ్లి ఓటు హక్కును వినియోగంచుకునేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అభ్యర్థుల ర్యాలీలు, మైకులు, వాహనాల ద్వారా ప్రసంగాలు... తదితరవన్నీ నేటి (మంగళవారం) సాయంత్రం 5 గంటలకు ముగుస్తాయన్నారు. ఈ నెల 29, 30వ తేదీల్లో అభ్యర్థులు పత్రికల్లో ప్రచార ప్రకటనలు చేసుకోవచ్చని, అయితే ఎంసీఎంసీ కమిటీ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ నెల 29న ఉదయం 8 గంటల నుంచి ఈవీఎంలను డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలిస్తామన్నారు. జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 312 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, 20 వేల మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ 95 శాతం పూర్తయిందని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్

### 15 అసెంబ్లీ నియోజకవర్గాల లెక్కలివి

- పోలింగ్ లోకేషన్లు : 1677
- మొత్తం పోలింగ్ కేంద్రాలు : 4119
- బ్యాలెట్ యూనిట్లు 9318, కౌంటింగ్ యూనిట్లు 5132, వీవీ ప్యాట్స్ 5737
- పోలింగ్ సిబ్బంది, ప్రిసైడింగ్ ఆఫీసర్లు – 4947
- పోలింగ్ అధికారులు 9894
- మైక్రో అబ్జర్వర్లు –810

### 1136 ఫిర్యాదులు..

ఎన్నికల నియామవళి ప్రవర్తనా ఉల్లంఘనపై సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 1136 ఫిర్యాదులు వచ్చాయని రొనాల్డ్‌రాస్ తెలిపారు. తమ వివరాలు తెలుపకుండా కూడా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

### అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్..

అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఉండటంతో పాటు అన్ని కేంద్రాల్లోని పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకునేందుకు సెంట్రలైజ్డ్ మానిటరింగ్ వ్యవస్థ ఉంటుందని రొనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్లు, జిల్లా ఎన్నికల అధికారి, ఐసీసీసీ పోలీస్ కమిషనర్ కార్యాలయాల్లో స్క్రీన్‌ల ద్వారా పరిస్థితులు వీక్షించే సదుపాయం ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వెలుపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 369 రూట్లలో.. 369 సెక్టార్లలో సెక్టార్ ఆఫీసర్లు ఉంటారన్నారు.

### 733 మంది హోం ఓటింగ్ సద్వినియోగం

గడిచిన కొద్ది రోజులుగా హోం ఓటింగ్ ప్రక్రియ చేపట్టగా.. 838 దరఖాస్తు చేసుకుంటే ఇప్పటి వరకు 733 మంది సద్వినియోగం చేసుకున్నట్లు రొనాల్డ్‌రాస్ తెలిపారు. 80 సంవత్సరాల పైబడిన 653 మంది, దివ్యాంగులు 80 మంది వరకు ఉన్నారని తెలిపారు. పోలీసుల విషయానికొస్తే గతంలో కంటే ఎక్కువ మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని, గతంలో 300 మంది ఉంటే.. ఈ సారి ఇప్పటికే 5 వేల మంది ఓటు వేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికీ ఓటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ సారి బ్యాలెట్ల పంపిణీ కొత్త విధానం కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నా.. అందరికీ అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. బుధవారంలోగా అందరికీ ఓటు వేసే సదుపాయం కల్పిస్తామన్నారు.

### హైదరాబాద్ జిల్లా ఓటర్ల వివరాలు..


- జిల్లా ఓటర్లు –45,36,852
- పురుషులు –2322623
- మహిళలు –2213902
- థర్డ్ జెండర్ –327

### ఎపిక్ కార్డు లేకుంటే 12 కార్డులు..

ఎపిక్ కార్డు లేని వారంతా 12 రకాల ఫొటో గుర్తింపు కార్డుల్ని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కమిషనర్ రొనాల్డ్‌రాస్ తెలిపారు. ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా, 1950 నంబర్ ఫోన్ ద్వారా పోలింగ్ కేంద్రం.. తదితర వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. రోజూ దాదాపు వెయ్యి ఫోన్లు వస్తున్నాయని, పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్‌కు ముందు ఉదయాన్నే 5.45 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు.

### రూ. 79.07 కోట్ల నగదు స్వాధీనం..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు చేపట్టగా.. ఇప్పటి వరకు రూ. 79.07 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ తెలిపారు.




## రేవంత్..

**టీడీపీని భ్రష్టు పట్టించింది నువ్వే..**

- గోపన్‌పల్లిలో నీ భూ కబ్జా భాగోతం అందరికీ తెలుసు: విప్ గాంధీ



మియాపూర్ , నవంబర్ 27: శేరి లింగంపల్లి నియోజకవర్గంలో రోడ్ షో సందర్భంగా కాంగ్రెస్ చీఫ్ రేవంత్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యల పట్ల విప్ అరెకపూడి గాంధీ ఘాటుగా స్పందించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. నాలుగు పార్టీలు మారిన రేవంత్, పార్టీ మారి టీడీపీకి ద్రోహం చేశానని తనని అనటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో టీడీపీని భ్రష్టు పట్టించి, సర్వనాశనం చేసింది రేవంతేనన్నారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ భాగోతాన్ని యావత్ భారత దేశం కళ్లారా.. చూసిందని గాంధీ పేర్కొన్నారు. రెండు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా అత్యంత పారదర్శకంగా తాను పని చేస్తున్నట్లు, భూ కబ్జాలకు పాల్పడ్డానన్న ఆరోపణలను నిరూపించాలని, నిజమని తేలితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, నిరూపించలేకపోతో నువ్వు సిద్ధమా? అని సవాల్ విసిరారు. గోపన్‌పల్లి సర్వే నం.127లో రేవంత్ రెడ్డి భూ కబ్జా భాగోతం తెలుసునని, వాటిని ఆధారాలతో సహా నిరూపించేందుకు తాను సిద్ధమని, ఏ వేదికకైనా వస్తానని, దమ్మంటే ముందుకు రావాలని విప్ గాంధీ ఘాటుగా పేర్కొన్నారు. ఓట్ల కోసం అవాకులు చవాకులు, లేని పోని ఆరోపణలు మానుకోవాలని, లేని పక్షంలో తగిన గుణపాఠం తప్పదని గాంధీ హెచ్చరించారు.

## తానువు చాలించి.. మరి కొందరికి జీవితమిచ్చి..


వనమ లీలావతి (ఫైల్)

ఖైరతాబాద్, నవంబర్ 27 : తాను మరణిస్తూ నలుగురికి జీవనదానం చేశారు ఖమ్మం జిల్లా వైరా మండలం తల్లాడకు చెందిన వనమ లీలావతి (65). ఆమెకు భర్త వనమ వెంకట కృష్ణయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 19న ఆమె బస్సులో వెళ్తుండగా, లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను సికింద్రాబాద్‌లోని కిమ్స్ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 26న ఆమె బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు.. అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. ఆమె శరీరం నుంచి కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలను సేకరించారు. అవయవదానానికి ముందుకు వచ్చిన ఆమె కుటుంబ సభ్యులను జీవన్‌దాన్ అభినందించింది.

## బీఆర్‌ఎస్‌కే దళిత క్రైస్తవులు, మాదిగల మద్దతు

- దళితులను దగా చేసే కాంగ్రెస్, బీజేపీలను భూస్థాపితం చేద్దాం
- క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు

హిమాయత్‌నగర్, నవంబర్ 27: రాష్ట్రంలోని దళిత క్రైస్తవులు, మాదిగల సంక్షేమం, అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నందున బీఆర్‌ఎస్‌కే అండగా ఉంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థులకే ఓట్లు వేయాలని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు జి.డేవిడ్ శాంతరాజు మాట్లాడుతూ, గతంలో దేశంలో, రాష్ట్రంలో పరిపాలన చేసిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు దళిత క్రైస్తవులకు, మాదిగలకు చేసిందేమీ లేదని, ఓటు బ్యాంకుగానే చూశాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పదేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశారని, అందుకు తాము బీఆర్‌ఎస్‌కు అండగా నిలబడుతున్నామని చెప్పారు. బీజేపీని గెలిపిస్తే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని, 2014లో హామీ ఇచ్చి మోసం చేసిన ప్రధాని మోదీ ఇప్పుడు ఎన్నికలు ఉన్నాయని ఎస్సీ వర్గీకరణను తెర మీదకు తీసుకు వచ్చారని ఈ విషయాన్ని మాదగలు గుర్తించాలన్నారు. ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తన స్వార్థ ప్రయోజనాల కోసం మాదిగల అస్థిత్వాన్ని ప్రతి ఎన్నికల్లో బీజేపీకి తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. దళితులు ఆర్థికంగా బలోపేతం కావాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి, దశల వారీగా పథకాన్ని అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. దళిత క్రైస్తవులకు, మాల, మాదిగలకు రాజకీయ రంగంలో సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. బంగారు తెలంగాణ రాష్ట్ర నిర్మాణం కావాలంటే బీఆర్‌ఎస్ తరుపున పోటీచేసే అభ్యర్థులను గెలిపించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు భక్తుల ఉదయ్‌రాజ్, ఎన్.పోచయ్య ఇజ్రాయిల్, బిషప్ స్వామిదాస్, కరుణాకర్, రాజ్‌కుమార్, కె.శ్రీనివాస్, అబ్రహం, జయనంద్ పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్ శాంతరాజు